


# స్వానుభవం

పి. ప్రేమచంద్ర

కథానిక

సాయంత్రం సులోచన, హేమ లత చక్కగా ముస్తాబై బీచ్ చేరుకున్నారు మనుషులు అట్టే లేనిస్థలంలో కూర్చున్నారు వాళ్లు నీళ్ళకి ఎంత దగ్గరగా కూర్చున్నారంటే ఏదైనా ఒక పెద్ద కెరటంవస్తే వాళ్లు అరచావుకున్న కాళ్లు తడుస్తాయన్నమాట. కాస్సేపటివరకూ ఇద్దరూ ఏమీ మాట్లాడలేదు. హేమ బీచంతా కలయజూస్తోంది. బహుశః తనకి తెలిసిన వాళ్లెవరైనా కనిపిస్తారని కాబోలు! సులోచన ఏమి టాలోచిస్తుందో తెలియదు గాని, ఇసుకలో తనపేరు ఇంగ్లీషులో, తెలుగులో, ఒకదాని తర్వాత ఒకటి వ్రాయడం, చెరపడం చేయసాగింది కాస్సేపు ఇట్లా గడిచింతర్వాత సులోచన చేతులు దులుపుకొని, సరిగ్గా కూర్చుని హేమతో ఇలా అంది.

“హేమా! మన బీచ్ ఏమైనా బావుంటుందీ?”

“అంటే?” అంది అర్థంకాక హేమ

“అంటేనా? మ్రెడాస్ మెరీనా బీచ్, బొంబాయి జూహు బీచ్—అలాంటి వాటిదగ్గర ఇది ఏమాత్రం? అని —”

“నిజమే! అవి చాల బావుంటాయట! మన ఊర్లో అన్నీ వున్నాయిగాని ఈ బీచ్ దశ మాత్రం ఏం బావులేదుస్మీ! నిజమే!” అని వప్పుకుంది హేమ.

“నీకు తెలుసో లేదో, మెరీనా బీచ్ చాల బావుంటుందట. నాతో ఇంటర్ చదివిన కస్తూరి ఇప్పుడు మ్రెడాస్‌లోనే ఉంది. మొన్న ఒకసారి కనబడి చెప్పిందిలే! చక్క, కాంటీన్‌లు అవీ ఉంటాయట మనలాంటి స్నేహితులు వెళ్ళి ఆ కాంటీన్ డాబాలమీద హాయిగా కూర్చొని ఏ ఐస్‌క్రీమో, ఏ కాఫీయో సిప్‌చేస్తూ కూర్చుంటే, ఈ సముద్రం మరీ అందంగా కనబడదూ! ఇక్కడ ఆ అందంలేదు సరిగదా! ఈ కూర్చునే స్థలమైనా కాస్త శుభ్రంగాఉంచితే అంతేచాలు. ఇక్కడేముంది, నా తలకాయ! అంతటి అదృష్టం మనకి రాసుందో లేదో అసలు.”

“అదేమాత్రమే సులో! నీవు తలంచుకుంటే మద్రాసే వెళ్ళిరాలేవా?”

“అదికాదే,మొద్దూ! చుట్టం చూపైతే ఏం ప్రయోజనం! మన కాపరం అలాంటి పట్నాల్లో వెలగాల్సిందే!” అంది సులోచన.

“ఓహో! అయితే ఏ ఆఫీసర్నయినా చూడు! పట్నం చెక్కేయవచ్చు”

“అదే చూస్తున్నాలే! మనం తలచుకొన్నది నెరవేరుస్తాంగా!” అంది దృఢనిశ్చయంతో సులోచన.

“అది సరేగాని, ఇప్పటికే చాల చీకటయింది. రా, పోదాం!” అంది హేమ లేస్తూ.

“వెళ్దామా! సరేకాని ఒక్కనిముషం. కాస్సేపు నీళ్ళల్లో నిలబడివద్దాం రావోయ్!” అంటూ నీళ్ళలోకి లాక్కెళ్ళింది హేమను.

“అబ్బ! చిన్నపిల్లలా ఏమిటా చేష్టలు” అంది హేమ చీరకుచ్చెళ్ళు తడవకుండా జాగ్రత్తపడుతూ.

* * *

పరీక్షలు దగ్గర పడుతూన్నాయ్!

అందుకని సులోచన ఆ రాత్రి చాలసేపటివరకూ చదువుతూ కూర్చుంది. ఆకలి తొందర పెట్టసాగిందేమో, తన గదినుండి బయటకువచ్చి 'అమ్మా, వడ్డించవే!' అంది

వాళ్ల నాన్నగారు చుట్ట ముట్టించి ఈజీ చెయిర్‌లో పడుకున్నారు సావకాశంగా.

"మీరు భోంచేసేసారా, అమ్మా!" అంది సులోచన.

"అవునమ్మా! మీ నాన్నగారు వడ్డించేయమంటే ఇద్దరం భోంచేశాము."

సులోచన భోజనాని కుపక్రమించింది.

"ఆ వేపుడుకూర ఇంకాస్త వేయవే" అంది సులోచన. తల్లి కూర వేస్తూ—

"ఇవాళ నాన్నగారు చాలా ముఖ్యమైన పని చేసుకొచ్చారు" అంది

"ఏమిటి" అన్నట్టు చూచింది కూతురు

"అదే! మొన్న అనుకున్న సంబంధం గురించి కనుక్కురావటానికి వెళ్ళారు వాళ్లు ఎల్లుండి నిన్ను చూసుకోడానికి వస్తారుట"

"మొన్నటి సంబంధమా? అంటే!"

"అదే! ఆ ఎం. ఏ, చదివాడే ఆ అబ్బాయ్! ఎలమంచిలి సంబంధం" అంది తల్లి

"ఆ! వాళ్లది యలమంచిలా!" అని— ఏడిసినట్టే ఉంది అనుకుంది మనస్సులో

"అంటే ఆ అబ్బాయి స్వస్థలం అన్న మాట. కాని ఆ అబ్బాయికి బొంబాయిలో ఏదో ఉద్యోగం అట!" అంది.

ఎంగిలి చేత్తో ఉందిగాని, లేకుంటే ఒక్క గంతువేసి వాళ్లమ్మను కౌగలించుకొనేది. అబ్బాయి ఎలా ఉన్నా ఇప్పుడు సులోచనకు బొంబాయి, అందులో తన కాపురం ముఖ్యం. అబ్బాయి ఎలా ఉంటాడో అన్న తలంపే వచ్చినట్టులేదు "ఈ సంబంధం ఖాయం అయితే బావుణ్ణు" అనుకుంది.

ఇక ఆ రాత్రంతా తనకా పెండ్లి అయిపోయినట్లు, బొంబాయిలో ఎంతో హాయిగా, సరదాగా—ఒక్కటే గాలి మేడలు!

ఆ రోజు రానే వచ్చింది.

పెండ్లివారు అమ్మాయిని చూడ్డానికి వచ్చారు. పెద్దవాళ్ళు మాట్లాడం అయింతర్వాత కాబోయే వధువుని, వరుణ్ణి అక్కడ వదలి నెమ్మదిగా జారుకున్నారు ఇరువైపుల వారు కాస్త చదువులు కలిగి, విశాల భావాలు ఉన్నవాళ్లవటం చేత, ముఖ్యులైన ఆ ఇద్దరూ మాట్లాడుకొని ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకుంటారనే ఉద్దేశంతో అలా చేసారు.

కాస్సేపటి వరకూ ఎవరూ మాట్లాడడానికి సాహసించలేక పోయారు. ఎంత కాలేజిలో చదివే పిల్ల అయినా, అందులోనూ గడసరిదైనా, సిగ్గక్కడ కెడుతుంది! చదువు లెక్కువయ్యేకొద్దీ సిగ్గు తగ్గదుగా! దానికి దీనికి సంబంధమే లేదేమో! సులోచన కన్నెత్తి అతణ్ణి చూడలేక పోతూంది. కాని మరోవైపు ఆయన ముఖం చూడాలనే ఉత్కర్ష మొగవాడు కాబట్టి ఆ అబ్బాయే పలకరించాడు-

"మీ గ్రూప్ ఏమిటండీ?" అని

"బోటనీ మెయిన్" అంది సిగ్గుతో

"మెడిసిన్‌కి వెళ్ళక, బి ఎస్సికి వచ్చారే!"

"ఎందువల్లో ఆ కోర్సు అంటే నాకు ఇష్టం లేదు హాస్పిటల్ అంటేనే భయంతో హడలెత్తే నాకు డాక్టర్ కోర్సా!!" ఇదేమిటి ఇంత చొరవగా మాట్లాడేస్తున్నాను అనుకుందేమో రక్కున ఆపేసింది ఇలాగే కాస్సేపు ఇదీఅదీ మాట్లాడిం తర్వాత సులోచన అంది—

"మీరు బొంబాయిలో ఎన్నాళ్లబట్టి ఉంటున్నారు?"

"ఒక సంవత్సరంబట్టి ఉంటున్నా లెండి. నేను. మరొక స్నేహితుడు ఒకలాడ్జిలో ఉండేవాళ్ళం ఆ ఫ్రెండ్‌కి రెండు నెలల క్రితమే పెండ్లి అయింది వాళ్ల మిసెస్ కూడా నేడో, రేపో వస్తుంది అతనితో నాకు కూడ ఒకమంచి ఇల్లు చూడమని చెప్పాను. ఎటుపోయి ఎటు వస్తుందోనని...." పెదాలపై చిన్న నవ్వు తొంగిచూడగా, చిలిపిగా ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు. ఆ మాటలు సులోచనకు హాయిగా వినిపించాయి....

* * *

ఆ వేసవిలో సులోచనకు జగన్మోహన్‌రావు నిచ్చి వైభవంగా వివాహం జరిపించారు.

పెండ్లికి సులోచన స్నేహితురాండ్రంతా వచ్చారు. వాళ్ళంతా సులోచన అదృష్టాన్ని పొగుడుతూ, ఆమె ఎన్నోనాళ్ళబట్టి కనిన కలలు నెరవేరుతున్నందుకు ఎంతో సంతోషించారు

సులోచనని ముందుగా యలమంచిలి అత్తవారింటికి తీసుకెళ్లారు అక్కడెంతో ప్రశాంతంగా ఉంది. జగన్మోహన్‌రావుకి తనస్వగ్రామమంటే చాల యిష్టం. కాని సులోచన సంగతి అలాకాదు ఎప్పుడు బొంబాయి వెళ్దామా, ఎప్పుడు 'బొంబాయి నివాసి' ననిపించుకుందామా అని ఉంది. ఒక రాత్రి నూతన దంపతులు వెన్నెల్లో కుర్చీలు వేసుకు ఏదో పిచ్చాపాటి మాట్లాడుతూ కూర్చున్నారు.

"ఏమండీ! బొంబాయి ఎలా ఉంటుంది? నాకు ఎంతకి వెళ్దామా అని ఉంది" అని సులోచన అంది.

"హుఁ! బొంబాయికేం. మహ చక్కగా ఉంటుంది కాని అక్కడ డబ్బున్న వాళ్ళదే జీవితం. మనలాంటి మధ్య తరగతి వాళ్ళకు గాదు. ఉద్యోగ ధర్మం! వెళ్ళక తప్పదు"— ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉన్నాడు అతను.

"ఆ! మీరు బొంబాయిలో ఉన్నారుగాబట్టి, మీకు అలానే అనిపిస్తుంది కాని నాకు మాత్రం ఎప్పుడు అక్కడ వాల్దామా అని ఉంది."

ఇంతలో అతను ఏదో చిన్నగా ఆలాపిస్తున్నట్టు ఉంటే ఏమిటా అని సులోచన చెవి ఒగ్గింది.

"ఎందుకే నీకింత తొందరా, ఓ చిలుక నా చిలుక, ఓ రామచిలుకా...." అంటూ తన వైపు చూసి అతను నవ్వుతూంటే—

"ఊఁ! పెంకి!!" అంటూ అతని చెవి మెలిపెట్టబోయింది.

ఇద్దరూ ఒక్కసారి కిలకిలా మన్నారు.

* * *

ఉభయులూ బొంబాయి చేరుకున్నారు.

"అబ్బ! ఇదేమన్నా స్టేషనా, భవనమా!" అనుకుంది విక్టోరియా టెర్మినస్‌చూచి సులోచన.

జగన్మోహన్‌రావు స్నేహితుడు సూర్యారావు స్టేషన్‌కు వచ్చి దంపతుల నిద్దరిని తన ఇంటికి తీసికెళ్ళాడు. ఆ సాయింత్రం వాళ్ళకై మాట్లాడి ఉంచిన ఇంటికి తీసికెళ్ళి దిగబెట్టి వచ్చాడు.

సులోచన ఒకసారి ఇల్లాంతా కలియదిరిగి వచ్చింది ఇద్దరికి చక్కగా సరిపోతుంది రెండు గదులు, వంటిల్లు, బాత్‌రూమ్ అన్నీ ఉన్నాయి పెద్ద పట్టణం గాబట్టి అన్ని సదుపాయాలతో కూడి ఉంది ఇల్లు అని అనుకుంది సులోచన ఎంతో రాత్రివరకు తన గృహం సర్దుకుంటూ కూర్చుంది. తాను అంతా చక్కపెట్టుకు వచ్చే సరికి అతను నిద్రపోతున్నాడు తాను అడుగుదామనుకున్న సంగతులు ఆ నాటికి అడగలేక పోయింది

ఆ మర్నాడు కాఫీ అందిస్తూ—

"ఏమండీ! మన ఇంటికి అద్దెంత? నా మనస్సుకు నచ్చిన ఇల్లండీ" అంది సులోచన

"అద్దెమాట అలా ఉంచు నీకు నచ్చింది కదా! అంతే చాలు. అన్నట్టు ఈ ఇల్లు మనకి రావటానికి ఎంత శ్రమపడాల్సి వచ్చిందనుకున్నావ్! అసలిక్కడ ఇళ్ళు దొరకడం మహా కష్టం. ముందు అడ్వాన్సంటూ పెద్ద మొత్తమే కట్టాలి మనం రెండు వేలు కట్టాం అద్దె వంద రూపాయలు"

"అబ్బ! వంద రూపాయిలే! పోనీలెండి అడ్వాన్సు కట్టారుగా అంతకాలం ఉండాలన్నమాట!"

"అబ్బే! అదేంలేదు అడ్వాన్సు అలానే ఉంటుంది. నెలనెల అద్దె కట్టాలి ఒకవేళ మనం ఈ లోగా ఇల్లు ఖాళీ చెయ్యాలనుకుంటే ఆ డబ్బుకు నీళ్ళు ఒదులుకోవాలి"

"ఆ! అంత డబ్బు గంగపాలే! ఇదెక్కడి న్యాయం అండీ!"

"ఇక్కడ అంతే! అట్టే మాట్లాడితే ఈ కాస్త గూడు కూడా ఉండదు." అన్నాడు

"అయ్యో! ఆ డబ్బుంటే ఏ రవ్వల నెక్లెసన్నా వచ్చునే" అనుకుంది సులోచన

జగన్మోహన్‌రావు మిగిలి ఉన్న ఆ నాలుగు సెలవ రోజుల్లో భార్యను నాలుగు చోట్ల తిప్పాడు. ఆ బస్సులు, ఎలక్ట్రిక్ ట్రెయిన్స్, జనాన్ని చూస్తుంటే సులోచనకు 'మతిగాని పోదు కదా' అని అనిపించింది.

జగన్మోహన్‌రావు ఇంట్లో ఉన్న నాలుగు రోజులు నాలుగు క్షణాల్లా గడిపారు. అతను ఆఫీసుకు వెళ్ళటం మొదలు పెట్టిందగ్గరనుండీ సులోచనకు ఏమీ తోచేది కాదు

ఇంట్లో పైపని చేయడానికి ఒక మనిషిని పెట్టుకున్నారు అది మరాఠీది. ఇక సౌంజ్ఞలతో వాళ్ళ దినచర్య ప్రారంభమయ్యేది. ఆ సౌంజ్ఞ లయినా దానికి కొన్ని అర్థమయ్యేవి. కాని కొన్ని చచ్చినా అర్థమయ్యేవికావు అలాం టప్పుడు సులోచనకు పెద్దపెట్టున ఏడ్వాలని పించేది. హిందీ మాట్లాడితే అది అర్థంచేసుకో గల్గేది. అందుకని సులోచన తనకు వచ్చునను కున్న ఆ నాలుగు హింది మాటలు వాడటం మొదలు పెట్టింది

"ఓ ఇథర్‌లావ్! ఏ నహీ....ఓ...."అంటూ మళ్లా సౌంజ్ఞ హిందీ తనకు అసలురాదు. హైస్కూల్‌లో ఉండగా హిందీ టీచర్‌ని ఏడ్పించి క్లాసులు ఎగగొట్టేది 'అయ్యో! అప్పుడు ఓ నాలుగు ముక్కలు నేర్చుకున్నా బావుణ్ణే' అని వాపోయింది. కాని ఏం లాభం తనకువచ్చిన ఆ నాలుగుమాటలు సినిమాలు చూడగా చూడగా వంటబట్టినవి. ఒకరోజు ఆ మనిషిని బజారుకు పంపి ఆవాలు తెప్పిద్దా మనుకుంది. ఆవాలుకు హిందీలో ఏమంటారో తెలిస్తేగా!

'అయ్యో! భగవంతుడా!! హిందీసినిమాలు చూసి ఏదో అర్థమవుతూంటే హిందీ ఒచ్చే సింది గామోను అనుకున్నా. అయినా నాపిచ్చి గాని, అక్కడ ప్యార్, ముహబత్, దిల్ ఇలాంటివే లక్షసార్లు వినిపిస్తాయి. కాని కత్తి పీట కేమంటారో, ఆవాలు కేమంటారో—ఇవెలా తెలుస్తాయి. చాలురా భగవంతుడా, బొంబాయి జీవితం!!' అనుకుంది.

ఆ సాయంత్రం ఏడుగంటలకు అతను ఆఫీసునుండి రాగానే సులోచన తనఘోషంతా చెప్పకుంది.

"పనిమనిషిని బజారుకు పంపవద్దు రేపటి నుండి నీవే వెళ్ళి కావలసినవన్ని తెచ్చుకో!"

"అదేవిటండీ! నేనా!! బజారుకా!!!" అంది ఆశ్చర్యపోతూ.

"అవును. నువ్వే! ఇక్కడ బజారు ఆడ వాళ్ళే చేసుకుంటారు. ఆక్షేపణ ఉండదు. హిందీలో ఏమంటారో అవసరమైన వస్తువుల పేర్లు ఒక కాగితంమీద వ్రాసిస్తాను సరేనా!" అన్నాడు.

"అలాగేలెండి!" అంది ఆలోచిస్తూ

"అన్నట్టు, ఆ కాగితం మాత్రం ఇంటో విడచి వెళ్ళకేం...." అన్నాడు నవ్వుతూ. సులోచనకూడా నవ్వింది

ఆ మర్నాటినుండి సులోచనకు బజారుపని ఒక కార్యక్రమం అయింది. ఆ రోజునుండి కాస్త ఉబుసుపోతూంది ఆమెకు.

* * *

సులోచనకు సినిమాలంటే చాల పిచ్చి. వచ్చిన మొదట్లో ఆయనతో కలసి ఒకసినిమా కెళ్ళింది. అప్పడే నెలరోజులకు పైనయిపో యింది. సులోచనకు మతిపోయినట్టుంది.

ఒకసాయంత్రం భర్తను అడిగింది.

"ఏమండీ! సినిమాకు తీసుకెళ్ళరూ!"

"ఏం సినిమాకి?"

"ఏదైనాసరే!"

"సరేలే, ఆదివారం వెళ్దాం."

"ఈ వేళ ఆదివారమేగా, ఇవాళ వెళ్దామా!" అంది

"అబ్బే! ఇవాళ ఆఫీసులన్నిటికి శెలవుగా. అంతా సినిమాల కెళతారు రిజర్వు చేసుకోక పోతే అక్కడ టికెట్లువుండవు" అన్నాడు.

"అయ్యో! రాత!! సినిమాకి వెళ్దామనుకున్న ప్పుడు వెళ్ళడానికి వీలులేదా! మోజు తీరి పోయిందిలెండి!" అంది

"అరె! అప్పడే! వచ్చి రెండు నెలలన్నా కాలేదు." అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

ఇలాగే సులోచన ఆరు నెలలు గడిపింది.

కూతురు చిన్నది. ఏం చేస్తుందో, ఏమో నని తల్లి బొంబాయి వచ్చింది. ఆవిడకు సులోచన, జగన్మోహన్‌రావు ఊరంతా ఒక రోజు త్రిప్పేసరికి గుండె దడ పట్టుకుంది.

"అమ్మాయ్! ఈ ఊర్లో నాకేమో గాభరాగా ఉందే! ఈ జనం ఏవిటి? ఈ బస్సులేవిటి? ఆ ఎలక్ట్రిక్ ట్రెయిన్స్ అయితే దిగేవరకన్నా

ఆగవు. అది ఎక్కి, దిగేవరకు నా గుండెలు లేవు. అబ్బ!'' అని తల పట్టుకుంది. ఆవిడ అక్కడ వారంకూడా ఉండలేక పోయింది. అవిడ కూతురినికూడా తనతో తీసుకెళతానంది.

ఎవరో తెలుగు వాళ్లు ఈ ప్రాంతాలకు బయలుదేరుతుంటే వాళ్లని తోడిచ్చి భార్యను అత్తగార్ని సాగనంపాడు జగన్మోహన్‌రావు.

* * *

సులోచన వచ్చిందని విని హేమ చూడ్డానికి వచ్చింది. కాస్సేపు హేమ తన చదువు సంగతి, ఊళ్ళో తమ ఉభయులకు తెలిసిన వాళ్ళ సంగతులు ఏమేమో చెప్పింది.

''ఏయ్! సులో! ఎప్పుడూ నే చెప్పడమే నేమిటి? బొంబాయి నగర నివాసివి కదా! విశేషాలు నీవు చెప్పాలి.''

''ఆ! ఏమున్నాయి గనక! అయినా దూరవు కొండల సామెత నీకు తెలియదా ఏం! పెళ్లవక పూర్వం పట్నాలమీద ఉండే మోజు కాస్తా హరీ అంది'' సులోచన.

''అదేం! అలా అంటున్నావ్! సంగతేమిటి?'' అంది హేమ ఆశ్చర్యంగా.

''అలాగే చెప్తాలే! కాని కాస్త సావకాశంగా కూర్చుంటే కథలా వినొచ్చు''

''అమ్మా టిఫిన్ కాస్త పంపించవే''—అని వాళ్ల అమ్మను కేక వేసింది.

టిఫిన్ వచ్చింది. ఇద్దరూ నెమ్మదిగా తింటున్నారు. సులోచన తన అనుభవాలు చెప్పడం మొదలు పెట్టింది.

''మనం అనుకుంటూ ఉండేవాళ్లం గదూ, అక్కడ జీవితం భలే హాయిగా ఉంటుందని. అదంతా నిజమేగాని, మా శ్రీవారన్నట్లు అది డబ్బున్న వాళ్ళకేగాని మనబోటి వాళ్లకు కాదనుకో!''

''అదేం! ఇన్‌కంటాక్స్ ఆఫీసర్ భార్యవు. నీకేం కొదవ!'' అంది హేమ.

''అదే నేనూ అనుకున్నానే తల్లీ! నీకు జ్ఞాపకముందా! మనతో ఫోర్తుఫారం సీత అనే అమ్మాయి చదువుతుండేది. వాళ్ల నాన్నగారు ఇన్‌కంటాక్సు ఆఫీసరు. వాళ్ల ఇంట్లో వాళ్ల అమ్మ పెద్ద కుర్చీ వేసుకు, తీరుబాటుగా కూర్చుని, నలుగురు ప్యూన్స్‌కి ఒకేసారి పనులు పురమాయిస్తూ ఉండేది. మనం కూడ ఇంచుమించు అలానే ఉంటాం గాబోలు ననుకున్నా. కాని అక్కడ అలాంటిదేం లేదు. బొంబాయిలో ఇలాంటి ఇన్‌కంటాక్సువాళ్లు లక్షలు. మనల్ని ఎవరూ 'కేర్' చెయ్యరు.''

''ఊఁ! తర్వాత''

''ఇక, భాషరాక నగం చచ్చాననుకో. అక్కడ ఎక్కువగా మరాఠీవాళ్లు, సింధీవాళ్లు ఉంటారు. హిందీ చాలా తక్కువ వినిపిస్తుంది. మా పనిది ఒక మరాఠీది ఇక చూడు....దాని భాష నా కర్థమవదు. నా భాష దానికి అసలే—''సున్న అన్నట్లుగా గాలిలో గీసి చూపించింది.

''అక్కడ నేను ఆరునెలలున్నానా, ఒక్క మాట పట్టుబడితే ఒట్టు!''

''భలే గమత్తుగా ఉందే! తర్వాత—''

''ఇంక ఇరుగు, పొరుగు - అలాంటిదేమి ఉంటదు. అంటే బొత్తిగా ఉండరనికాదు. ఒక బిల్డింగ్‌లో ఎన్నో కుటుంబాలుంటాయి. ఒక గుమ్మం సింధీవాళ్ళదైతే, ఆ ప్రక్క తెలుగు వాళ్లు, ఆ ప్రక్క మరాఠీ అలా అన్నమాట. ఆడవాళ్లు ఒకరినొకరు చూచుకొని ఒక నవ్వు విసరుకుంటారు అంతే, మాటపలుకు ఉండదు. ఉండడానికైనా భాష రావాలిగా!

తంతి : జవ్వాదు ఫోను : 4890

31 జవ్వాదు
301 వత్తులు
3001

సుగంధ మండలము

ప్రొప్రయిటర్సు. S. V. పళణిమలై &
S. V. రంగస్వామి

19, గోవిందప్పనాయక్ వీధి, మదరాసు-1

తపాలుపెట్టె నెం: 1897

బ్రాంచస్, మధుర బెంగుళూరు విజయవాడ.

ఓ రోజు నేను, వారూ అలా షికారు వెళ్ళాం ఒకావిడ కనిపించి నవ్వింది నేనూ నవ్వేశాను ఆ మనిషిని ఎక్కడో చూచినట్టు గుర్తు కాని సరిగ్గా జ్ఞాపకం రావటం లేదు నా అనుమానాన్ని నెమ్మదిగా బయటపెట్టేసరికి, ఆయన నవ్వుతూ 'మన మేడమీద సెకెండ్ ఫ్లాట్‌లో ఉన్నారు కదూ!' అన్నారు. ఇలా ఉంటాయి పరిచయాలు

నాకు సినిమాలంటే ఎంత పిచ్చో నీకు తెలుసుగా కాని అక్కడున్నంతకాలం, రెండే రెండు చూచాను వారికి ఆదివారం ఒక్క రోజు శెలవు. ఆ రోజే వెళ్ళాలి పోనీ, ఆ రోజు వెళ్ళడానికి ఎంత చిక్కనుకున్నావ్! మంచి పిక్చర్ అయితే ఓ నెల్లాళ్ల ముందే రిజర్వ్ చేసుకోవాలి ఎందుకంటా వేమో! ఆఫీసు లన్నిటికి ఆ రోజే శెలవు ఆ జానెడు కొంపలలో నుండి ఎప్పుడు బయటపడతామా అని చూచే వారు, ఆ రోజు బయటపడతారు సాధారణంగా సినిమాలకి పోతుంటారు ఇక చెప్పలేనంత రష్!

ఆ రోజు సినిమాకు వెళ్తున్నాం. నా నగలు పెట్టుకున్నాను. అది చూచి మావారు ఒక్క సారి నోరు ఆవలించి—

'ఏమిటి? ఇవన్ని నీతో తెచ్చుకున్నావా? చచ్చాం పో! అసలు సినిమానుండి తిరిగి వచ్చే సరికి ఈ పాత్రలు, పెట్టెలు ఉంటాయో, ఉండవో అదే అనుమానంతోనే రావాలి గదా! ఈ నగలు చూచాడా, మర్నాడే వస్తాడు ఎవడైనా!' అన్నాడు

ఆ భయంతో సగం చచ్చిన నాకు సినిమాలేం రుచిస్తుంది! ఆ మర్నాడు వాటి నన్నింటిని తీసికెళ్ళి బేంక్‌లో పడేసి వచ్చారు. ఈ సారి వెళ్ళేటప్పుడు అవన్నీ ఇక్కడే దిగవిడిచి వెళు తున్నా. సరదా అన్నా తీరలేదు అయినా ఏం చెయ్యడం. అలా ఉంది మన బొంబాయి జీవితం!

"పోనీ! ఈవైపుకి ట్రాన్స్‌ఫర్ పెట్టుకోండి! అప్పుడు హాయిగా ఉండొచ్చు. ఏం?" హేమ ఓ సలహా ఇచ్చింది.

"అదో గొంతెమ్మ కోరిక! అదీ అడిగాను. కాని ఆయనకు ఈ ప్రాంతాలకు రావటానికి ఇష్టంలేదు చేసేది ఇన్‌కంటాక్సు ఉద్యోగం. ఇటువైపు మనకంతా తెలిసినవాళ్ళే అంతా ఆ వేళకు చుట్టరికాలు కలుపుకుంటారు. ఇహ మొహమాటమైతే ఉద్యోగం చేసేదెట్లా? అక్కడైతే ఆ సేర్స్‌దగ్గిర టాక్సు గోళ్లూడగొట్టి వసూలు చేస్తారు,

ఆ! ఇలా ఎంత ఆడిపోసుకున్నా తరగదు లెద్దూ! ఏమిటో నా క్షోభ వెళ్ళబోసుకోవటం తప్ప వేరే గత్యంతరం లేదు" అంటుంటే దీపాలు పెట్టేశారు.

* * *

ఆ రోజు సులోచన బొంబాయి వెళ్ళిపో తుంది. హేమ కూడా స్టేషనుకు వచ్చింది

"ఈ నాలుగురోజులు స్వచ్ఛమైన గాలి పీల్చానర్రా ఘళ్ళా ఆ కూపంలోకి వెళ్తున్నాను" అంది సులోచన.

"మొదటిసారి వెళ్ళేటప్పుడు ఎంతకు బొంబాయిలో వాల్దునా అని వెళ్ళావుగా. అప్పుడు మాతో మాట్లాడడానికే నీకు తీరికలేదు. కదూ!" అంది హేమ నవ్వుతూ

"సరేలే! నీ వేళాకోళానికేంగాని, నా సలహా ఒకటి! నీకు సంబంధాలొస్తున్నాయని మీ అమ్మగారన్నారు. పెద్ద పట్టణాల వాళ్ళని చచ్చినా చేసుకోకు. ఏ తాడి, దువ్వాడ అబ్బా యినో చేసుకో, సుఖపడ్తావ్!" ఇలా మాట్లా డుతూ ఉండగానే రైలు కదిలింది.

* * *

హేమ ఇంటికి తిరిగి వచ్చింది

హేమను చూడగానే, వాళ్ల అమ్మ—

"అమ్మాయ్! ఇవాళ సాయంత్రం నిన్ను చూచుకోడానికి వస్తున్నారు ఆ అబ్బాయి కల కత్తాలో...." ఆమె ముగించక ముందే,

"క....ల....క....త్తా! నాకా సంబంధం వద్దుబాబోయ్!" అనేసింది హేమ.

"ఏమిటి వద్దే! నీకేం తెలిసిందని! ఆ అబ్బాయి కలకత్తాలో ఇంజనీరింగు చదువు తున్నాడు."

"అమ్మయ్య! అంతే కదా!" అనుకుని స్నేహితురాలిని ఒకసారితలచుకుంది హేమ. ★